గనుల నిబంధనలకు సున్నం రాష్ట్ర ఖజానాకు కన్నం

హద్దులు దాటిన పెద్దల బేరం

సూర్యాపేట సున్నపురాయి గనుల వేలంపై అనుమానాలెన్నో! • డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు లేకుండానే ఈ-టెండర్ల ప్రక్రియ

మూడు బ్లాకుల వేలంలో ఎంఎండీఆర్ చట్టానికి తిలోదకాలు • రెండు బ్లాకుల్లో అక్రమ మైనింగ్‌పై ఇప్పటికే కోర్టుల్లో కేసులు

- అవే బ్లాకుల్ని దక్కించుకొన్న వివాదాస్పద సిమెంట్ కంపెనీలు
- పోటీ లేక మరో బ్లాక్‌ను రద్దు చేస్తున్నట్టు గనుల శాఖ ప్రకటన
- ఆర్టీఐ కింద ఈ-టెండర్ల సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ
- వ్యక్తుల ప్రాణాలకు హాని ఉన్నదంటూ గనులశాఖ తిరస్కరణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గనుల శాఖ కొన్నిరోజుల కిందట సూర్యాపేటలోని మూడు సున్నపురాయి బ్లాక్‌లకు నిర్వహించిన ఈ-టెండర్ల ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గనుల లీజుకు సంబంధించి గతంలో అభియోగాలు ఎదుర్కొంటున్న రెండు సిమెంటు కంపెనీలు ఈ మూడు బ్లాకుల్లో రెండు బ్లాకులను కైవసం చేసుకోవడం వెనుక ఏదో మతలబు దాగున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ-టెండర్ నోటిఫికేషన్ మొదలు.. వేలం ముగిసిన తర్వాత సమాచారాన్ని గోప్యంగా ఉంచడం వరకు ప్రభుత్వం వ్యవహరిస్తున్నతీరు తీవ్ర ఆరోపణలకు తావిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎంఎండీఆర్ (గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం) నిబంధనలను తుంగలో తొక్కి.. హద్దులేవీ నిర్ణయించకుండానే లీజుకు సంబంధించిన వేలం నోటిఫికేషన్ జారీ చేయడం విమర్శలకు తావిస్తున్నది.



టెండరు నోటిఫికేషన్‌లో బ్లాకులవారీగా మైనింగ్ లీజు వివరాలు



Department of Mines and Geology
Government of Telangana
Email:dmg-eauction mines@telangana.gov.in

Date: November 22, 2024

Declaration of Preferred Bidder

S.No	Block Name	Forward Auction Date	Name of Preferred Bidder	Highest Final Price Offer
1	Saidulanama Block	19 November, 2024	Deccan Cements Limited	42.85% (Forty-two Point Eight Five Per Cent)
2	Sultanpur Block	20 November, 2024	NCL Industries Limited	45.05% (Forty-five Point Zero Five Per Cent)

టెండర్ల ప్రక్రియలో భాగంగా మైనింగ్ లీజులపై తుది నిర్ణయం

ఎంఎండీఆర్ చట్టం ఏం చెప్తున్నది?

- ఎంఎండీఆర్ చట్టంలోని చాప్టర్-2 (మైనింగ్ లీజుకు ఒప్పందం) 5(2)లో... 'రాష్ట్రాలు ఏదైనా ఖనిజం మైనింగ్ లీజు వేలానికి టెండర్ల ప్రక్రియ నిర్వహించే ముందు కేంద్రం అనుమతి తీసుకోవాలి. తదుపరి ఇచ్చే టెండర్ నోటిఫికేషన్‌లో మైనింగ్ లీజు బ్లాకు ఎక్కడ ఉన్నదనేది స్పష్టంగా సరిహద్దు మూలల్ని అక్షాంశాలు, రేఖాంశాలతో (లాటిట్యూడ్,లాంగిట్యూడ్) సహా పొందుపర్చాలి' అనే నిబంధన ఉన్నది.
- ఇదే చాప్టర్‌లోని బిడ్డింగ్ ప్రాసెస్ నిబంధన 9(ఎ)లో... 'మైనింగ్ బ్లాకు లీజుకు అనుమతి ఇచ్చేందుకుగాను జారీ చేసిన ఈ-టెండర్ నోటిఫికేషన్ సమయంలో కచ్చితంగా సంబంధిత బ్లాకు అక్షాంశాలు, రేఖాంశాల్ని బిడ్డింగ్ ప్రక్రియలోనే పొందుపర్చాలి' అని ఉన్నది.
- ఇదే చాప్టర్‌లోని నిబంధన 9(బి)లో... 'రాష్ట్రాలు టెండర్ డాక్యుమెంట్‌లోనూ మైనింగ్ బ్లాక్ లాటిట్యూడ్, లాంగిట్యూడ్ మూలల వివరాలను (డీజీపీఎస్ -డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం కార్నర్ పాయింట్లతో) స్పష్టంగా పేర్కొనాలి' అని నిబంధన ద్వారా స్పష్టంచేశారు.
- అంటే ఎంఎండీఆర్ చట్టం ప్రకారం నోటిఫికేషన్‌లోనే ఆయా ఖనిజ నిక్షేపాలున్న ప్రాంతంలో ఫలానా అక్షాంశాలు, రేఖాంశాలు హద్దులుగా ఉన్న ప్రాంతంలో మైనింగ్ లీజునకు ఇస్తున్నట్లు స్పష్టం చేయాలి. దానికి సంబంధించిన టోపోషీట్‌ను కూడా జతచేయాలి. తద్వారా ప్రభుత్వం నిర్దేశించిన హద్దుల్లోనే టెండర్ దక్కించుకున్న కంపెనీలు మైనింగ్ చేయాల్సి ఉంటుంది.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పసుపులబోడు, సైదుల్‌నామా, సుల్తాన్‌పూర్ అనే మూడు బ్లాకుల్లో సున్నపురాయి నిక్షేపాల మైనింగ్ లీజు వేలంపై కేంద్రం అనుమతి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను చేపట్టింది. వేలం వేసే గనుల సరిహద్దు మూలలను అక్షాంశాలు, రేఖాంశాలతో (డీజీపీఎస్ -డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం కార్నర్ పాయింట్లు) తెలుపుతూ ఈ-టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంఎండీఆర్ చట్టం చెప్తుంది. కానీ ఆ చట్టాన్ని తుంగలో తొక్కి సరిహద్దు మూలాలు లేకుండానే ప్రభుత్వం వెయ్యి హెక్టార్లలో ఓ రెండొందల హెక్టార్లు ఎక్కడ ఉన్నదనేది స్పష్టం చేయకుండానే ఈ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో లీజు దక్కించుకున్న సిమెంటు కంపెనీలను 'ఇష్టాను సారంగా తవ్వుకోండి' అని పచ్చజెండా ఊపినట్టా? లేకపోతే దాని వెనక ఇంకేదైనా మర్మం ఉందా? అనే వాదనలు వినిపిస్తున్నాయి. మూడు బ్లాకుల లీజుకు వేలం నిర్వహిస్తే... అందులో రెండు బ్లాకుల్లో గతంలోనే రెండు కంపెనీలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నాయని న్యాయస్థానాల్లో కేసులు కొనసాగుతున్నాయి. తాజా టెండర్ ప్రక్రియలో అవే రెండు కంపెనీలు అవే బ్లాకులను మళ్లీ సొంతం చేసుకోవడం ఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నది. మిగిలిన మూడో బ్లాకు మాత్రం పోటీ లేక రద్దు కావడం ఇక్కడ కొసమెరుపు. దీంతో కేవలం ఆ రెండు కంపెనీలకు లబ్ధి చేకూర్చడమే కాకుండా అక్రమ మైనింగ్ అభియోగాల నుంచి వారిని కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ-టెండర్లలో ఎంఎండీఆర్ చట్టాన్ని ఉల్లంఘించిందనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

చట్టానికి తూట్లు పొడిచిన క్రమం ఇదీ..

తెలంగాణ గనులు, భూగర్భశాఖ ఖనిజ నిక్షేపాలున్న రిజర్వ్ ఫారెస్టులోని ప్రాంతాలను వేల ఎకరాల విస్తీర్ణంలోని బ్లాకులుగా... ఆపై వాటిలోనే కంపార్టుమెంట్లుగా విభజిస్తారు. ఆ మేరకు రికార్డుల్లో కంపార్టుమెంట్ల నెంబర్లు కూడా నమోదు చేస్తారు. ఈ క్రమంలో నిరుడు ఇచ్చిన ఈ-టెండర్ నోటిఫికేషన్‌లో సుల్తాన్‌పూర్, సైదుల్‌నామా, పసుపుల బోడు బ్లాకుల్లో కొంత విస్తీర్ణంలో సున్నపురాయి మైనింగ్ లీజు వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

- ఇందులో భాగంగా సైదుల్‌నామా బ్లాకులో 421.90 ఎకరాల్లో వేలం లీజు చేపట్టారు. వాస్తవంగా సైదుల్‌నామా బ్లాకులోని అటవీప్రాంత విస్తీర్ణం సుమారు 3,102.58 ఎకరాలు. వీటిని 25, 26, 27 బ్లాకులుగా విభజించారు. కానీ నోటిఫికేషన్‌లో ఎక్కడా కంపార్టుమెంట్ నెంబర్ పొందుపర్చలేదు. బ్లాకు పూర్తి విస్తీర్ణంలో మైనింగ్ లీజు ఇచ్చే విస్తీర్ణం కేవలం 16.82 శాతం. మరి అంతపెద్ద బ్లాకులో ఈ ప్రాంతం ఎక్కడ ఉన్నదనేది నోటిఫికేషన్‌లో ఎక్కడా పేర్కొనలేదు.
- సుల్తాన్‌పూర్ బ్లాకులో వేలం లీజు విస్తీర్ణం 337.76 ఎకరాలు. కానీ వాస్తవంగా ఈ బ్లాకులోని అటవీ ప్రాంత విస్తీర్ణం 4,260.09 ఎకరాలు. ఈ బ్లాకులో 11, 12, 13, 14, 804 బ్లాకులు ఉన్నాయి. నోటిఫికేషన్‌లో ఎక్కడా బ్లాకులను పొందుపర్చలేదు. అంటే లీజు ఇచ్చే విస్తీర్ణం.. పూర్తి విస్తీర్ణంలో కేవలం 7.92 శాతంగా ఉంటే ఆ రిజర్వు ఫారెస్టులో ఏ మూలకు, ఎక్కడ మైనింగ్ చేయాలో ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ఎక్కడా స్పష్టం చేయలేదు. ఎటువంటి హద్దులనూ నిర్ధారించలేదు.

> అదేవిధంగా పసుపులబోడు బ్లాకులో ప్రభుత్వం చేపట్టిన వేలం లీజు విస్తీర్ణం 343.20 ఎకరాలు. దీని పూర్తి విస్తీర్ణం 2,490.52 ఎకరాలు. ఇందులో 29, 30, 31 బ్లాకులు ఉన్నాయి. అయితే గనులు, భూగర్భశాఖ ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లో ఈ బ్లాకుకు సంబంధించి మాత్రం కంపార్టుమెంట్-29 అని పేర్కొన్నారు. ఇందులోనూ హద్దుల్ని (డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు) ప్రస్తావించలేదు. ఈ క్రమంలో లీజు ఇచ్చే భూవిస్తీర్ణం 13.78 శాతం మాత్రమే. కంపార్ట్‌మెంటు-29లో ఎక్కడ మైనింగ్ చేయాలని సూచిస్తున్నారో తెలియని పరిస్థితి.

- వాస్తవానికి అధికారులు డీజీపీఎస్ కార్నర్ పాయింట్లతో సహా కచ్చితంగా ఈ హద్దులు ఉన్న ప్రాంతంలోనే మైనింగ్ చేపట్టాలనేది నోటిఫికేషన్‌లో పొందుపరచడం పెద్ద కష్టమేమీ కాదు. పైగా ఆ వివరాలన్నీ శాఖ రికార్డుల్లో కూడా ఉంటాయి. కానీ నోటిఫికేషన్‌లో ఇవ్వకపోవడం యాదృచ్ఛికం కాదని, దాని వెనక అసలు మతలబు దాగి ఉన్నదనేది స్పష్టమవుతున్నది.

అభియోగాలున్న వారికే ఆయా బ్లాకులు

కేంద్ర ప్రభుత్వ నిబంధనల్ని తుంగలో తొక్కి ఉద్దేశపూర్వకంగానే సున్నపురాయి మైనింగ్ లీజు వేలం ఈ-టెండర్ల ప్రక్రియను నిర్వహించారనేందుకు మరింత బలాన్ని చేకూర్చేలా వివాదాస్పద సిమెంటు కంపెనీలే ఆయా బ్లాకుల్లో లీజు వేలాన్ని దక్కించుకోవడం గమనార్హం.

- సైదుల్‌నామా బ్లాకులో దక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ ఇష్టానుసారంగా సున్నపురాయి నిక్షేపాల్ని అనుమతి లేకుండా అక్రమ మైనింగ్ చేస్తుందని కోటేశ్వరరావు అనే సామాజిక కార్యకర్త గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి సుదీర్ఘంగా కేసు నడుస్తున్నది. అంటే సైదుల్‌నామా బ్లాకులోని రిజర్వు ఫారెస్టుపై దక్కన్ సిమెంట్స్ వారికి అవగాహన ఉన్నదనేది దీనిద్వారా స్పష్టమవుతున్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ-టెండర్లలో దక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ సరిగ్గా సైదుల్‌నామా బ్లాకుకు బిడ్‌లను వేసింది. మైనింగ్ లీజును దక్కించుకున్నది. మిగిలిన సుల్తాన్‌పూర్, పసుపులబోడు బ్లాకులపై ఆ కంపెనీ పెద్దగా ఆసక్తికనబర్చలేదని తెలుస్తున్నది.
- అదేవిధంగా సుల్తాన్‌పూర్ బ్లాకులోని అటవీ ప్రాంతంలో నాగార్జున సిమెంట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) వాళ్లు యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నారని మరో సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసు కూడా ప్రస్తుతం పెండింగులోనే ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో ప్రధానంగా సుల్తాన్‌పూర్ రిజర్వ్ ఫారెస్టులో అనుమతికి మించి సున్నపురాయి నిక్షేపాలను ఎన్‌సీఎల్ తవ్వుకొని వినియోగించుకుంటున్నదని రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించింది. ఆ నివేదికలోని సిఫారసు మేరకు రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ 2021లోనే ఆ కంపెనీకి రూ.91.42 కోట్ల జరిమానా కూడా విధించింది. అయితే తాజా ఈ-టెండర్లలో ఎన్‌సీఎల్ సరిగ్గా ఇదే బ్లాకును దక్కించుకోవడం గమనార్హం. ఈ కంపెనీకి మిగిలిన రెండు పసుపులబోడు, సైదుల్‌నామా దక్కలేదంటే వాటిపై దృష్టి సారించలేదన్నమాటే కదా.
- మిగిలిన పసుపులబోడు బ్లాకు విషయంలో మాత్రం నోటిఫికేషన్‌లో కంపార్ట్‌మెంట్-29 అని పేర్కొన్నారు. కానీ మూడు కంటే తక్కువ సాంకేతిక అర్హత ఉన్న బిడ్లు దాఖలైనందున నిబంధనల ప్రకారం ఈ బ్లాకు వేలాన్ని రద్దు చేస్తున్నట్టు గనులు, భూగర్భ శాఖ ప్రకటించింది. ఈ బ్లాకుకు సంబంధించి ఏ కంపెనీపైనా ఇప్పటివరకైతే అక్రమ మైనింగ్ వంటి అభియోగాలు లేవు. అందుకే ఈ బ్లాకు వేలం రద్దయిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.
- ఇలా రెండుచోట్ల అభియోగాలు ఎదుర్కొంటున్న సిమెంటు కంపెనీలకే లీజు వేలం దక్కడం ఒక అంశమైతే.. అక్రమ మైనింగ్‌పై న్యాయస్థానాల్లో కేసులు పెండింగులో ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటికి ఈ-టెండర్ల ప్రక్రియ నిర్వహించడం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నట్టయ్యింది.

సమాచారం అడిగితే ప్రాణాలతో ముడి!

న్యాయస్థానాల్లో అక్రమ మైనింగ్‌పై కేసులు పెండింగులో ఉన్నప్పటికీ ప్రభుత్వం వేలం టెండర్ల ప్రక్రియను చేపట్టినందున సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో అసలు టెండర్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఇవ్వాల్సిందిగా సమాచార హక్కు చట్టం కింద సంబంధిత శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులో కోరినట్టుగా రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖనిజాల మైనింగ్, అనుబంధ కార్యకలాపాల వల్ల ప్రభుత్వానికి రూ.5 వేల కోట్ల ఆదాయం వస్తుందని గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (న్యాయ) ఆర్.రామకృష్ణారెడ్డి సమాధానమిచ్చారు. కానీ వెంకట్‌రెడ్డి తన దరఖాస్తులో కోరిన టెండర్ల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చేందుకు మాత్రం నిరాకరిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ తన లేఖలో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం-8(ఎ),(డీ),(ఈ), (జీ),(ఐ)నిఅనుసరించి సమాచారాన్ని బహిర్గతం చేయలేమని అందులో స్పష్టంచేశారు. అయితే ఆర్టీఐ చట్టంలోని ఈ సెక్షన్లను పరిశీలించినపుడు క్లుప్తంగా ఒక వ్యక్తి ప్రాణాలకు హాని ఉన్నపుడు మాత్రమే సమాచారాన్ని బహిర్గతం చేయలేమని తేలింది. అంటే ఇప్పుడు సున్నపురాయి గనుల లీజు వేలం సమాచారాన్ని బయటపెడితే ఎవరి ప్రాణాలకు హాని కలుగుతుంది? ఎవరు హాని కల్పిస్తారు? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన టెండర్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలు, డాక్యుమెంట్లు అనేవి జనబాహుళ్యంలో ఉండాల్సినవి. పబ్లిక్ డొమైన్‌లో ఉండాల్సిన సమాచారాన్ని.. బయటపెడితే వ్యక్తుల ప్రాణాలకు ముప్పు అని చెప్పడం విడ్డూరం. కాగా సున్నపుగనుల టెండర్లలో ఇలాంటి విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి ఈ వ్యవహారంపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదును నమోదు చేసుకొని పరిశీలిస్తున్నట్లు సీవీసీ స్పష్టం చేసింది.

మూడో మనిషికి తెలిసేదెట్ల?

ఈ-టెండర్ నోటిఫికేషన్‌లోనే డీజీపీఎస్ కార్నర్ పాయింట్లను అక్షాంశాలు, రేఖాంశాలతో సహా ఇవ్వాల్సి ఉంది. దేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏకంగా పదమూడు రాష్ట్రాలు (మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, తమిళనాడు) 91 చోట్ల ఖనిజ నిక్షేపాల మైనింగ్ లీజు వేలం కోసం ఈ-టెండర్ల ప్రక్రియ చేపట్టాయి. ప్రతి రాష్ట్రం ఎంఎండీఆర్ చట్టానికి అనుగుణంగా అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన డీజీపీఎస్ కార్నర్ పాయింట్లు ఇచ్చాయి. టోపోషీట్లు సైతం నోటిఫికేషన్ సమయంలోనే అందుబాటులో ఉంటాయి. దీని ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్ నోటిఫికేషన్ చూసిన ప్రతి ఒక్కరికీ ఆ మైనింగ్ బ్లాకు ఎక్కడ ఉన్నదనేది హద్దు మూలలతో సహా గూగుల్‌లో చూసినా తెలిసిపోతుంది. కానీ తొలిసారిగా ఈ-టెండర్ల ప్రక్రియ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్నర్ పాయింట్లు ఇవ్వకపోగా కనీసం ఆయా బ్లాకుల్లోని ఏ కంపార్ట్‌మెంట్ అనేది కూడా బహిర్గతం చేయకపోవడం ఏదో గూడుపుఠాణి జరిగిందనేందుకు నిదర్శనం. ఈ-టెండర్ నోటిఫికేషన్‌లోని 'ఖనిజ మైనింగ్ బ్లాక్ సారాంశం (సమ్మరీ)' 1(2) కార్నర్ పాయింట్లు (లాటిట్యూడ్, లాంగిట్యూడ్) అనే కాలమ్‌లో 'డీజీపీఎస్ కార్నర్ పాయింట్లను 'అనుబంధం 1బి'లో ప్రచురించాం అని పేర్కొన్నారు. అంటే టెండరు నిబంధనల ప్రకారం రూ.5 లక్షలు చెల్లించి బిడ్ కొనుగోలు చేసిన వారికి మాత్రమే వాటి వివరాలు ఇస్తామనేది దాని సారాంశంగా చెబుతున్నారు. కానీ అయినవారు కాకుండా కాని వారు ఎవరైనా బిడ్ కొనుగోలు చేసినపుడైనా డీజీపీఎస్ కార్నర్‌పాయింట్లు ఇచ్చారా? లేదా? అనేది కూడా అంతుబట్టని అంశం. ఈ నేపథ్యంలో రిజర్వు ఫారెస్టులోని ఆ బ్లాకుపై పూర్తి అవగాహన ఉన్నవారికి మాత్రమే ఆ వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. తద్వారా కొత్త వారు ఎవరూ ఈ టెండర్లలో పాల్గొనేందుకు ముందుకు రారు. పైగా మైనింగ్ లీజు వేలం ఇస్తున్న విస్తీర్ణం పూర్తి బ్లాకు విస్తీర్ణంతో పోలిస్తే 7-16 శాతం వరకు మాత్రమే ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం చెప్తున్న ఆ ప్రాంతం ఎక్కడ, ఏ మూలకు ఉన్నది? వేలం దక్కించుకున్న కంపెనీలు ఎక్కడ మైనింగ్ చేయాలి? ఇష్టానుసారంగా మైనింగ్ చేస్తే దానికి లెక్క, ప్రాతిపదిక ఏముంటుంది? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.



టెండర్ల వివరాలు ఇవ్వడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆర్టీఐ చట్టంలోని నిబంధనలు పొందుపరిచి ఇచ్చిన సమాధాన లేఖ

తొలి నుంచీ నిబంధనల ఉల్లంఘనే!

దేశవ్యాప్తంగా రాష్ట్రాల పరిధిలోని ఖనిజాల వేలం నిర్వహించేందుకుగాను చేపట్టే ఈ-టెండర్ల ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం 2015లోనే గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఎంఎండీఆర్)ను రూపొందించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన గెజిట్ జారీ అయ్యింది. ఇందులో స్వల్ప మార్పులు చేస్తూ గత ఏడాది కూడా గెజిట్ విడుదలైంది. దీని ఆధారంగానే దేశంలోని రాష్ట్రాలన్నీ దాదాపుగా ఖనిజాల లీజు వేలం కోసం ఈ-టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. మొన్నటివరకు దేశంలోని 13 రాష్ట్రాలు ఈ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా టెండర్ల ప్రక్రియను నిర్వహించాయి. 14వ రాష్ట్రంగా తెలంగాణ గత ఏడాది ఆగస్టులో తొలిసారిగా ఈ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో కృష్ణా నదీ తీరం వెంట ఉన్న రిజర్వ్ ఫారెస్టులో సున్నపురాయి నిక్షేపాలు ఉన్నాయి. పసుపులబోడు, సైదుల్‌నామా, సుల్తాన్‌పూర్ అనే మూడు బ్లాకుల్లో సున్నపురాయి నిక్షేపాల మైనింగ్ లీజు వేలంపై కేంద్రం అనుమతి తీసుకున్న ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ 2024, ఆగస్టు 30న టెండర్ నోటిఫికేషన్ (నెం.226 3906/డీఎంఅండ్‌జీ-ఎంఐ/ఎల్ఎస్టీ/2023) జారీ చేసింది. బిడ్‌ల స్వీకరణ, పరిశీలన ఇలా పలు ప్రక్రియల తర్వాత నిరుడు నవంబరు చివరి వారంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, రెండు సిమెంటు కంపెనీలకు అనుమతి పత్రాలను కూడా జారీ చేశారు. కానీ నోటిఫికేషన్‌లోనే ఎంఎండీఆర్ చట్టంలోని కీలకమైన నిబంధనకు తిలోదకాలిచ్చారు.

ఎల్ ఆర్ఎస్‌పై భగ్గుమన్న రియల్టర్లు

మొదటిపేజీ తరువాయి...

తెరపైకి తెచ్చి వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలానే సాగితే రియల్ వ్యాపారులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. 2022కు ముందు జరిగిన డాక్యుమెంట్లకు ఎల్ఆర్ఎస్ లేకుండా చేయాలని, దీని తర్వాత జరిగిన లేఅవుట్లలోని డాక్యుమెంట్లకు ఈ నెలాఖరు కాకుండా డిసెంబర్ 31వరకు గడువు పెంచాలని కోరారు. ఎన్నో ఏండ్ల కింద రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు కూడా ఎల్ఆర్ఎస్ కట్టాలని సబ్‌రిజిస్ట్రార్ చెపుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం మండల అధ్యక్షుడు పేరెపల్లి స్వామి గౌడ్, ప్రధానకార్యదర్శి కేతరాజు శంకర్, నాయకులు అనంతుల నర్సింహ గౌడ్, ఎండీ చాంద్‌పాషా, కొయ్యడ గాలయ్యగౌడ్, నోముల రాజశేఖర్ రెడ్డి, బొమ్మకంటి గోపాల్, గోసుల సోమయ్య, దంటిక అంజయ్య, ఎండీ రషీద్, సుక్క శ్రీశైలం, బద్దుల సుధాకర్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

ఎల్ఆర్ఎస్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. రిజిస్ట్రేషన్ విధానాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలి. ఈ విధానం నిరుపేదలకు భారంగా మారింది. ఎన్నో ఏండ్ల కింద కొన్న ప్లాట్లకు ఇప్పుడు డబ్బులు కట్టడం సరైంది కాదు. నిరుపేదలు వేలకు వేలు కట్టి అప్పులపాలు కావాల్సిందే. ఎల్ఆర్ఎస్‌పై సబ్ రిజిస్ట్రార్‌ను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. ప్రభుత్వం నిర్ణయాన్ని తక్షణమే మార్చుకోవాలి. ఇప్పటికే రియల్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్ఆర్ఎస్ ఉంటే వ్యాపారాలు బంద్ చేసుకోవాల్సిందే. ఇలానే ప్రభుత్వం కొనసాగిస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున రిలే దీక్షలు చేపడుతాం.

–పేరెపల్లి స్వామి గౌడ్, రియల్ వ్యాపారుల సంఘం చౌటుప్పల్ మండల అధ్యక్షుడు

ఎల్ ఆర్ఎస్‌పై అవగాహన కల్పించలేదు..

ఎల్ఆర్ఎస్‌పై క్రయవిక్రయదారులకు పూర్తి అవగాహన కల్పించలేదు. ఇప్పటికే మార్కెట్ లేని సమయంలో ప్లాట్లు కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. గతంలో కొన్న ప్లాట్లు అమ్ముడుపోక అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమయంలో ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పెట్టడం బాగాలేదు. ఇలానే సాగితే రియల్ వ్యాపారం పదేండ్ల వెనక్కి పోవాల్సిందే. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రహించి 2022కు ముందు జరిగిన డాక్యుమెంట్లకు ఎల్ఆర్ఎస్ లేకుండా చేయాలి. మిగతా వాటికి గడువు పెంచాలి. ఇది వ్యాపారులకు ప్లాట్లు కొన్న పేదలకూ ఇబ్బందే.

–కేతరాజు శంకర్, రియల్ వ్యాపారి, తంగడపల్లి, చౌటుప్పల్

'పెద్ద'మనిషికి చీఫ్ అడ్వయిజర్ పదవి!

- ముఖ్యనేతకు అధిష్ఠానం ఎర్త్
- ఇటీవలే కాంగ్రెస్ సీనియర్ నేత ఇంటికి వెళ్లిన ముఖ్యనేత
- ప్రధాన సలహాదారు పదవి ఇస్తే.. సలహాలు, ఇస్తానన్న సీనియర్
- వెంటనే ఓకే చెప్పిన హై కమాండ్

హైదరాబాద్, మార్చి11(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ 'పెద్ద'గా పేరువడిన ఒకరిని రాష్ట్ర ప్రభుత్వంలోకి కీలకపాత్రలో ప్రవేశపెట్టేందుకు పావులు కదులుతున్నాయా? ఆ 'పెద్ద'కు చీఫ్ అడ్వైజర్ పదవి కట్టబెట్టి, క్యాబినెట్ హోదాలో సెక్రటేరియట్‌లో కూర్చోబెట్టడానికి రంగం సిద్ధమైందా? ఈ మేరకు మూడు నాలుగు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయా? అంటే గాంధీభవన్ వర్గాలు అవుననే చెప్తున్నాయి. ఇటీవల జరిగిన ఆసక్తికర పరిణామాలు ఇందుకు దారితీస్తున్నాయని గాంధీభవన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయడం వలన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదన తెర మీదికి వచ్చిన నేపథ్యంలో త్వరలో దక్షిణాది రాష్ట్రాల నేతల సమన్వయంతో ఒక కార్యాచరణ రూపొందించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని సమన్వయ పరిచే బాధ్యతను కాంగ్రెస్ పెద్దలు ఒకరికి అప్పగించాలని అధిష్ఠానమే సూచించిందనీ, దీంతో ఇటీవల రాష్ట్ర ముఖ్యనేత స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నేత ఇంటికి వెళ్లి దాదాపు అరగంట పాటు చర్చించారని తెలిసింది. ఈ సందర్భంగా ముఖ్యనేత ఈ ఏడాది కాలంలో తనకు ఎదురైన అనుభవాలను సదరు సీనియర్ నేత వద్ద ఏకరువు పెట్టినట్టు సమాచారం. నలుగురు మంత్రుల పేర్లను ప్రస్తావిస్తూ, వారి ప్రతి అడుగూ తనకు వ్యతిరేకంగానే ఉంటున్నదని, ఉన్నవీ లేనివి కల్పించి ఢిల్లీకి మోస్తున్నారని, అధిష్ఠానం దృష్టిలో తనను విలన్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయినట్టు తెలిసింది. కొంతమంది సీనియర్ బ్యూరోక్రాట్లు తాను తీసుకునే నిర్ణయాలను ఖాతరు చేయడం లేదని, వారిని పిలిచి ఏదైనా 'ముఖ్యమైన ఫైల్' అని చెప్తే, కిందికి వెళ్లి 'నోట్‌ఫైల్' అని రాస్తున్నార